

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు రావుల శ్రీధర్‌రెడ్డి, మన్నె గోవర్ధన్‌రెడ్డి

లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలి

- బీఆర్ఎస్ నేతల డిమాండ్

బంజారాహిల్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు రావుల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. లగచర్ల రైతులను ప్రభుత్వం అన్యాయంగా జైల్లో పెట్టిందన్నారు. తమ భూములను కాపాడుకునేందుకు రైతులు జాగ్రత్త పడటం ప్రభుత్వం నేరంగా పరిగణించడం సబబుకాదన్నారు. ప్రభుత్వాన్ని ఎవరు ప్రశ్నించినా వారిని జైలుకు పంపిస్తున్నారని, అయితే ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందన్నారు. ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులను విడుదల చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మూడు రోజులుగా నీటి సరఫరా బంద్

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఖైరతాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాగునీరు ఒకరోజు రాదని ప్రకటించిన జలమండలి అధికారులు మూడు రోజులుగా సరఫరా నిలిపివేయడంతో ఖైరతాబాద్‌లోని పలు బస్తీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెడ్‌హిల్స్‌లో తాగునీటిని సరఫరా చేసే పెద్ద పైప్‌లైన్ మరమ్మతుల కోసం ఆదివారం నీటి సరఫరా ఉండదని అధికారులు ప్రకటించారు. సోమవారం మధ్యాహ్నం నీటి సరఫరా ఉంటుందని ప్రకటించినా పనులు పూర్తి కాకపోవడంతో మంగళవారం రాత్రి వరకు సరఫరా చేయలేదు. దీంతో ఖైరతాబాద్‌లోని ఇందిరానగర్, గాంధీనగర్, మహాభారత్‌నగర్, బీజేఆర్ నగర్, బుడగజంగం బస్తీ, చింతలబస్తీ, ఏసీ గార్డ్స్ తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగేందుకు నీరు లేకపోవడంతో కొనుగోలు చేయాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా నీటి సరఫరా చేయని జలమండలి అధికారులు కనీసం వాటర్ ట్యాంకులను పంపే ప్రయత్నం సైతం చేయలేదు. దీంతో కొన్ని బస్తీల ప్రజలు జలమండలి కార్యాలయాన్ని ముట్టడించారు. అధికారులకు ఫోన్ చేస్తే స్పందించడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్థిక వ్యవస్థలో ఆతిథ్య రంగానిది కీలకపాత్ర

- మహీంద్రా విశ్వవిద్యాలయం వీసీ డా. యాజులు మేడూరి

బేగంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహీంద్రా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌ను ప్రారంభించారు. బేగంపేటలోని తాజ్ వివంతా హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ డీన్ చెఫ్‌తో కలిసి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డా. యాజులు మేడూరి వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. ఆతిథ్య రంగం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈ రంగంలో విద్యార్థులను సిద్ధం చేయడం కోసం మహీంద్రా స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌ను ప్రారంభించామన్నారు. వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో కలినరీ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో నాలుగేళ్ల నిడివిగల బీఎస్సీ (హానర్స్) కోర్సును ప్రవేశపెట్టనున్నామన్నారు. ఏదైనా బోర్డు నుంచి 80 శాతం మార్కులతో 10+2 పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులని ఆయన పేర్కొన్నారు. వివరాల కోసం యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా యూనివర్శిటీ ప్రతినిధి రాకేష్ శ్రీధరన్ తదితరులు పాల్గొన్నారు.



హ్యాకథాన్‌లో గెలుపొందిన విద్యార్థులతో ముఫకంజా ఇంజనీరింగ్ కాలేజీ ప్రతినిధులు

హ్యాకథాన్‌లో ముఫకంజా విద్యార్థుల సత్తా

బంజారాహిల్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌తో పాటు కేంద్ర ప్రభుత్వంలోని మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్స్ ఇన్నోవేషన్ సెల్ సంయుక్తంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీల్లో బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా మంగళవారం కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి, కాలేజీ అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు కాలేజీకి చెందిన రెండు జట్లు జాతీయ స్థాయిలో వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన హ్యాకథాన్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. రెండు రోజుల పాటు ఐఐటీ గౌహతి, ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ గాంధీనగర్ ప్రాంతాల్లో నిర్వహించిన హ్యాకథాన్‌లో దేశ వ్యాప్తంగా పలు కాలేజీలకు చెందిన విద్యార్థులు హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ విభాగాల్లో ప్రతిభను ప్రదర్శించారు.

జేబులో గంజాయితో తిరుగుతున్న వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జేబులో గంజాయి పెట్టుకొని తిరుగుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ వ్యక్తి తన ప్యాంట్ జేబులో గంజాయి పెట్టుకొని తిరుగుతున్నాడని బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఈనెల 16న కేబీఆర్ పార్కు గేట్ నంబర్ 9 వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అస్సాంకు చెందిన మహ్మద్ మొఫిజుల్ ఇస్లాం అనే వ్యక్తిని తనిఖీ చేయగా పది గ్రాముల గంజాయి ప్యాకెట్ దొరికింది. అతడిని ప్రశ్నించగా నానక్‌రాంగూడ వద్ద గుర్తు తెలియని వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్టు చెప్పాడు. ఇస్లాం ఆరు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి టోలీచౌకిలో ఉంటూ వెల్డింగ్ పని చేస్తున్నాడు. మత్తుకు బానిసై గంజాయి తీసుకుంటున్నట్టు విచారణలో తేలింది. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్లమ్మ భక్తులకు ట్రాఫిక్ కష్టాలు

- బల్కంపేట ఆలయం వద్ద నిత్యం ఇబ్బందులు
- పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే ద్విచక్రవాహనాల పార్కింగ్
- పట్టించుకోని ఆలయ సిబ్బంది, అధికారులు
- అవస్థలు పడుతున్న భక్తులు, వాహనదారులు

అమీర్‌పేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద ట్రాఫిక్ కారణంగా భక్తులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఇదే పరిస్థితి ఉందని వాహనదారులు వాపోతున్నారు. కాగా, ఇక్కడున్న బోనం కాంప్లెక్స్ పక్కన దాతల సహకారంతో నిర్మించి లాటరీ పద్ధతిలో ఉచితంగా పూజా సామగ్రి విక్రయదారులకు అందజేసిన మడిగెల ఎదుట కొందరు వ్యాపారాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన మేర స్థలం లేని కారణంగా నిత్యం ఎల్లమ్మ ఆలయ వద్ద భక్తులు, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు మంత్రి హోదాలో తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రయత్నాలు చేశారు. దాతల సహకారంతో నిర్మించిన మడిగెలను 2023 మే 4న ప్రారంభించి అదే సంవత్సరంలో లాటరీ విధానంలో 34 మంది లబ్ధిదారులకు అందజేశారు. వారంతా లోపలి నుంచి మాత్రమే విక్రయాలు కొనసాగించాలని, వీటి ముందు టేబుళ్లు వేసి పూజా సామగ్రి అమ్మకూడదని నాటి ఆలయ అధికారులు హెచ్చరించారు. అయితే ఆ ఆదేశాలను వ్యాపారులు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా వాహనాల పార్కింగ్ కారణంగానే ఇక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఆలయం పక్కనే రోడ్డుపై ద్విచక్రవాహనాలను లైన్‌గా పార్క్ చేస్తుండడంతో బీకేగూడ వైపు వెళ్లే రోడ్డు ఇరుకుగా మారుతోంది. దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్య రోజురోజుకు జటిలంగా మారుతున్నా ఆలయ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు పార్కింగ్ భవనం నిర్మాణం కోసం ఆలయం వెనుకవైపు రోడు ఆక్రమణలకు పాల్పడటంతో ఈ పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఆది, మంగళ వారాల్లో తీవ్ర అసౌకర్యం

బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఆది, మంగళ వారాల్లో భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. అయితే వారంతా తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు సమీపంలో స్థలం లేకపోవడంతో సులభ్ కాంప్లెక్స్ నుంచి బోనం కాంప్లెక్స్ చివరి మడిగె వరకు రోడ్డుకు ఇరువైపులా పార్క్ చేస్తున్నారు. దీంతో ఆది, మంగళ వారాల్లో అయితే ఈ దారి గుండా వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాహనదారులు, భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బల్కంపేట నుంచి ఆలయానికి వచ్చే రహదారిలో వాహనాలు ముందుకుసాగే పరిస్థితి ఉండటం లేదు. ఆలయ పరిసర ప్రాంతాలు, బీకేగూడ వార్డు కార్యాలయం, తదితర ప్రాంతాల్లో బోనాలు చేసుకుని డప్పు చప్పుళ్లతో వస్తున్న భక్తులకు దారిలేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని భక్తులు, వాహనదారులు కోరుతున్నారు.



ఆలయం పక్కన రోడ్డుపై పార్క్ చేసిన ద్విచక్రవాహనాలు



బోనం కాంప్లెక్స్ వద్ద పరిస్థితి ఇదీ..

అధికారులు పట్టించుకోవడం లేదు



బల్కంపేట ఎల్లమ్మ ఆలయం బోనం కాంప్లెక్స్ పక్కన ఉన్న మడిగెల ముందు వేసిన టేబుళ్లను తొలగించడంతో పాటు వాహనాల పార్కింగ్ విషయంలో ఆలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలి. ఈ విషయాన్ని తాము అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలి.

- ఆరెల్లి సునీల్‌కుమార్, రేణుకానగర్

పార్కింగ్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి



సమస్య పరిష్కారం కోసం మధ్యలోనే ఆగిపోయిన మల్టీ లెవల్ పార్కింగ్ భవనాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి. అమ్మవారిని దర్శించుకునేందుకు దూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలను నిలపాల్సి వస్తోంది. దీంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎమ్మెల్యే దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలి.

- ప్రవీణ్, భక్తుడు, మల్కాజ్‌గిరి

జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేయాలి

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

పంజాగుట్ట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేయాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను మాదిగ సంఘాల నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ జరిగితే రాష్ట్రంలో ఎక్కడ తమ ఉనికి కోల్పోతామో అని కొందరిలో ఆందోళన ఉందని, వర్గీకరణ సమస్య ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించే వారు రాష్ట్రంలో ఉన్నారని విమర్శించారు. జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ ఫలాలు అందాలని, అందుకోసం జిల్లాలను యూనిట్‌గా తీసుకోవాలని కోరారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్, రంగారెడ్డి జిల్లాలలో మాదిగలు అధిక సంఖ్యలో ఉన్నారని.. జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం చేయలేదని, కేవలం తనకు మంత్రి పదవి కోసం ఉద్యమం చేసి మహాసభలు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని మాదిగలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంట నడవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావడానికి మాదిగలు కీలక పాత్ర పోషించారని.. మంద కృష్ణమాదిగ వెంట మాదిగలు లేరని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు నంద్రు నరసింహారావు మాదిగ, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బొర్రెల్లి సురేష్, బొమ్మెర స్టాలిన్, శివ మాడుగుల తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాదిగ సంఘాల నాయకులు

సనాతన ధర్మాన్ని తిరిగి స్థాపించడమే లక్ష్యం

- సద్గురు మహాదేవ్ స్వామీజీ

పంజాగుట్ట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా హిందూ ధర్మం లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారని సనాతన హిందూ ధర్మ జాగృతిసేవా సంస్థ నిర్వాహకులు, సద్గురు మహాదేవ్ స్వామీజీ మఠం పీఠాధిపతి సద్గురు మహాదేవ్ స్వామిజీ అన్నారు. హైందవ సనాతన ధర్మాన్ని తిరిగి స్థాపించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం బీరంగూడగుట్టలోని భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానం వద్ద సనాతన హిందూ ధర్మ జాగృతి మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ సంఘాలు, పీఠాధిపతులతో కలిసి మహాసభ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల్లో హిందూ ధర్మంపై, హిందువులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. అందరం ఏకతాటిపైకి వచ్చి మన ధర్మాన్ని కాపాడుకుందామన్నారు. ఈ నెల 22న నిర్వహించనున్న సభలో స్వామిజీలు, 108 మంది పీఠాధిపతులు, హిందూ బంధువులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర జంగమ సమాజం అధ్యక్షుడు ఆర్.విశ్వేశ్వరయ్య, వీర ధర్మజ స్వామి, డాక్టర్ శివకుమార స్వామి, శశిధర్ ఆచార్య, శివ స్వామి, సురేషణ తదితరులు పాల్గొన్నారు.



సనాతన హిందూ ధర్మ జాగృతి మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఇందిరమ్మ ఇళ్లకు భారీగా దరఖాస్తులు

- ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించిన డా. చిన్నారెడ్డి

బేగంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన ప్రజలు ఇళ్ల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 465 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, ప్రజావాణి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఇళ్ల కోసం యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించినప్పటికీ ఆ విషయం తెలియని ప్రజలు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకునేందుకు భారీగా తరలివచ్చారు. చిన్నారెడ్డి సూచన మేరకు సిబ్బంది ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని హౌసింగ్ అధికారులకు అందజేశారు. పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖలకు 130, మైనార్టీకి 87, విద్యుత్ శాఖకు 68, రెవెన్యూకు 60, హోం శాఖకు 20, ప్రవాసీ ప్రజావాణికి 1, ఇతర శాఖలకు 99 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ప్రజావాణి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి



'ఏకలవ్య కాలనీ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్త వేణుగోపాల్.. చిత్రంలో శివారెడ్డి తదితరులు

'ఏకలవ్య కాలనీ' పుస్తకావిష్కరణ

ఖైరతాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యానికి 'ఏకలవ్య కాలనీ' పేరుతో మంచి కథా సంపుటి అందుబాటులోకి వచ్చిందని సాహితీవేత్త ఎన్.వేణుగోపాల్ అన్నారు. మంగళవారం స్మారాట్ కాంప్లెక్స్‌లోని సాధి బుక్‌స్టాల్‌లో పలమనేరు బాలాజీ రూపొందించిన కథా సంపుటి ఏకలవ్య కాలనీ పుస్తకావిష్కరణ జరిగింది. ఆవిష్కరించిన వేణుగోపాల్ మాట్లాడుతూ.. పలమనేరు బాలాజీ కథకుడిగా, కవిగా, విమర్శకుడిగా, నవలాకారుడిగా సృజనను కొనసాగిస్తూ సమాజానికి మంచి పుస్తకాలను అందిస్తున్నారని కొనియాడారు. తొలి పుస్తకాన్ని అందుకున్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి మాట్లాడుతూ.. గిరిజన జీవితాల్లోని ఉద్వేగాలను తెలుగు పాఠకులకు సంపుటి రూపంలో బాలాజీ అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు స్కైబాబా, కృపాకర్ మాదిగ, జూపాక సుభద్ర, తాయమ్మ కరుణ, సమ్మెట ఉమాదేవి, దాట్ల దేవదానం రాజు, సుంకోజీ దేవేంద్ర చారి, ఇంద్రవెల్లి రమేష్, ఎంవీ రామిరెడ్డి, మెర్సీ మార్గరేట్, వాసిరెడ్డి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్ఏసీఏ హైదరాబాద్ చాప్టర్ నూతన కార్యవర్గం ఎన్నిక

పంజాగుట్ట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఆడిట్ కంట్రోల్ అసోసియేషన్ (ఐఎస్ఏసీఏ) హైదరాబాద్ చాప్టర్ వార్షిక సర్వసభ్య సమావేశం మంగళవారం సోమాజిగూడలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలను చర్చించి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జీసీఎస్ శర్మ, ఉపాధ్యక్షుడిగా జీవీ వంశీకృష్ణ, కోశాధికారిగా సి.వెంకట్రామ్, కార్యదర్శిగా రాజ్‌పవార్, మెంబర్‌షిప్ డైరెక్టర్‌గా రజనీష్ దాసరి, ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా సతీష్ బొట్ట, ప్రభుత్వ రిలేషన్స్ డైరెక్టర్‌గా పవన్‌కుమార్ మారెళ్ల, షీ లీడ్స్‌టెక్ డైరెక్టర్‌గా వరలక్ష్మి, అకడమిక్స్ డైరెక్టర్‌గా డా. సౌజన్య పొన్నలూరు ఎన్నికయ్యారు. అసోసియేషన్ హైదరాబాద్ చాప్టర్‌లో 1,200 మంది సభ్యులు ఉన్నారని నూతన అధ్యక్షుడు జీసీఎస్ శర్మ వెల్లడించారు.

వాటర్‌బోర్డులో నలుగురికి కారుణ్య నియామకం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డులో నలుగురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు లభించాయి. బోర్డులో విధులు నిర్వర్తిస్తూ మరణించిన నలుగురి ఉద్యోగుల వారసులకు వారి విద్యార్హతల ఆధారంగా కారుణ్య నియామకం చేపట్టారు. ఇందుకు సంబంధించిన నియామకపత్రాలను ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో ఈడీ మయాంక్ మిట్టల్ వారికి అందించారు. బాగా పనిచేయాలని, బోర్డు ప్రతిష్ఠను పెంచాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.



అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

అసెంబ్లీ ముట్టడికి యత్నించిన పీడీఎస్‌యూ నేతలు

- పలువురిని అరెస్ట్ చేసిన పోలీసులు

ఖైరతాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖకు మంత్రిని కేటాయించాలని, బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ నాయకులు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ మాట్లాడుతూ.. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడం లేదన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థుల మరణాలపై విచారణ జరిపి ఆయా సంస్థల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఏర్పడి సంవత్సరం దాటినా విద్యారంగ అభివృద్ధికి, పేద విద్యార్థుల అభ్యున్నతికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు విమర్శించారు. బి.నరసింహారావు, ఎస్.అనిల్, ఎం.నరేందర్, భాస్కర్, పృథ్వీ సాయి, సురేష్, వెంకటేష్, రాకేష్, సీతారాం తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు.

హైదరాబాద్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడిగా రాపోలు రవీందర్

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడిగా రాపోలు రవీందర్ ఎన్నికయ్యారు. మంగళవారం సాయంత్రం జలసౌధలో ఈ సంఘం కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. వివిధ జిల్లాల నుంచి 400లకు పైగా ఇంజనీర్లు ఇందులో పాల్గొన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా చక్రధర్, గౌరవ అధ్యక్షుడిగా ధర్మ, కోశాధికారిగా ఎస్.అంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా కె.రాజశేఖర్, వి.రామకృష్ణ, ఆర్.సత్యనారాయణగౌడ్, వి.విద్యాసుమన్, శ్రీనివాస్‌గౌడ్, విజయలక్ష్మిలు, అసోసియేట్ ప్రెసిడెంట్‌లుగా డి.రమ, ఎం.కృష్ణ, చక్రపాణిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ఏర్పడ్డ తర్వాత తొలిసారి పదవీవిరమణ చేసిన ఇంజనీర్లు ఎవరూ సర్వీసులో లేకపోవడాన్ని స్వాగతిస్తూ ప్రభుత్వానికి సంఘం ధన్యవాదాలు తెలిపింది.

19న మాల సంఘాల ఆధ్వర్యంలో 'చలో అసెంబ్లీ'

పంజాగుట్ట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పిచ్చిన వెంటనే ఎలాంటి అధ్యయనం చేయకుండా తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చేపడతామని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని మాల సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. ఎస్సీల్లో 59 కులాలకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ తాము ఈ నెల 19న 'చలో అసెంబ్లీ' పేరుతో అసెంబ్లీ ముట్టడి చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ నాయకులు జి.చెన్నయ్య, మందాల భాస్కర్, చెరుకు రామచందర్ విలేకరులతో మాట్లాడారు. గతంలో చంద్రబాబు నాయుడు వర్గీకరణ చేయగా సుప్రీంకోర్టు కొట్టేసిందని వారు గుర్తు చేశారు. మళ్లీ 20 సంవత్సరాల తరువాత అదే సుప్రీంకోర్టు రాష్ట్రాలే వర్గీకరణ చేసుకోవచ్చు అని చెప్పడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. అది సుప్రీంకోర్టు తీర్పు కాదని, మోదీ తీర్పని వారు ఆరోపించారు.

వాయు కాలుష్య నియంత్రణపై వర్క్‌షాప్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాయు కాలుష్యానికి కారణమవుతున్న ప్లాస్టిక్, వ్యవసాయ వ్యర్థాలను బహిరంగంగా కాల్చే పద్ధతులకు స్వస్తి పలికేలా అవగాహన శిబిరాలు నిర్వహించాలని టీజీపీసీబీ నిర్ణయించింది. ఇందులో భాగంగా కాలుష్యాన్ని నియంత్రించే పద్ధతులు, పరికరాల వినియోగంపై ఐఐటీ నిపుణులు, అర్బన్ లోకల్‌బాడీస్ అధికారులు సిబ్బందితో మంగళవారం పీసీబీ అధికారులు వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముంబై ఐఐటీ ప్రొఫెసర్ అనురాగ్ గార్గ్ మాట్లాడుతూ.. దుమ్ము, పారిశ్రామిక ప్రక్రియలు, పంటలను కాల్చడం, ఘన వ్యర్థాలు, కాలం చెల్లిన వాహనాలు.. తదితర కాలుష్య కారకాలు పర్యావరణంపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని అన్నారు. వాయు కాలుష్యాన్ని నియంత్రించే పరికరాలను సమర్థవంతంగా వినియోగించాలన్నారు. ప్రముఖ పల్మోనాలజిస్ట్ డాక్టర్ నారాయణ్ మాట్లాడుతూ.. వాయు కాలుష్య కారకాలు.. పెద్దలతోపాటు శిశువుల ఆరోగ్యంపైనా తీవ్రమైన ప్రభావం చూపుతాయన్నారు. బ్రోంకైటిస్, ఆస్తమా, క్యాన్సర్ వంటి తీవ్రమైన అనారోగ్య ప్రమాదాలను కలిగిస్తాయన్నారు. పీసీబీ సభ్య కార్యదర్శి జి.రవి మాట్లాడుతూ.. బహిరంగ దహన పద్ధతుల నియంత్రణపై అవగాహన కల్పించే నిమిత్తం కేంద్రప్రభుత్వం నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టిందన్నారు. వాయు కాలుష్యానికి గల మూలాలను గుర్తించి, బహిరంగ దహనం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వాయు కాలుష్యం అధికంగా ఉన్న నగరాలలో హైదరాబాద్ ఒకటిగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని, రాష్ట్రంలోని సంగారెడ్డి, నల్గొండ నగరాలు కూడా నాన్ అటైన్‌మెంట్ సిటీల పరిధిలోకి వస్తాయన్నారు. వర్క్‌షాప్‌లో నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ కన్సల్టెంట్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న పీసీబీ సభ్య కార్యదర్శి రవి



సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ తదితరులు

రైతులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

బౌద్ధనగర్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి జైల్లో పెట్టినందుకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంగళవారం సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష్య సాధింపుగా రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజుసుందర్, శైలేందర్, సాయియాదవ్, రవీంద్రసాగర్, జాకీర్, లలిత, అర్చన తదితరులు పాల్గొన్నారు.



పెన్షనర్స్ డే వేడుకల్లో ఆర్పీఎఫ్ విశ్రాంత ఉద్యోగులు

ఘనంగా పెన్షనర్స్ డే

బౌద్ధనగర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చిలకలగూడలో పెన్షనర్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అసోసియేషన్ అధ్యక్షుడు టి.వరప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జీవీఎస్ రాయుడులు ముఖ్య అతిథులుగా పాల్గొని కీశే డీఎస్ నాకరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... అప్పట్లో రైల్వే ఉద్యోగి నాకరే సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో 1983 డిసెంబరు 17వ తేదీన నుంచి పింఛన్లు ఇవ్వాలని ఉత్తర్వులు రావడంతో ప్రతి సంవత్సరం డిసెంబరు 17న పెన్షనర్ డేను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి వి.ముత్యాలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు విశ్రాంత రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న విమలాదేవి, జయకర్ డేనియల్

క్రిస్మస్ వేడుకలు

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఐ నీడ్ హెల్ప్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొదటి సారిగా ట్రాన్స్‌జెండర్స్, ఎంఎస్ఎం, కమర్షియల్ సెక్స్ వర్కర్స్ కోసం ప్రత్యేక క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మంగళవారం సికింద్రాబాద్ వైఎంసీఏలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రముఖ సువార్తికురాలు విమలారెడ్డి ,యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ వ్యవస్థాపకురాలు జాయ్ చెరియన్, వైఎంసీఏ అధ్యక్షులు జయకర్ డేనియల్, ఐ నీడ్ హెల్ప్ ట్రస్టు వ్యవస్థాపకులు జాకబ్ చిన్నప్ప, జెస్సీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీరెలు, బెడ్ షీట్లు, కేక్‌లు పంపిణీ చేశారు.



నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులు

ఆటోడ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

పద్మారావునగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆటోడ్రైవర్ల యూనియన్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి పద్మారావునగర్‌లోని వివేకానంద విగ్రహం ఆటోస్టాండ్ వద్ద ఆటో యూనియన్ నాయకుడు వెంకటేష్ ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకర్ యాదవ్, వేణు, కొమురెల్లి బాబు, జోగు రాములు, కిశోర్, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గం సభ్యులు

పద్మశాలీల సంక్షేమానికి కృషి

హరిహరకళాభవన్ డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పద్మశాలీల సంక్షేమానికి కృషి చేస్తానని పద్మశాలీ సంఘం నూతన రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ తెలిపారు. సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. నూతన అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో 15 శాతం ఉన్నప్పటికీ కేవలం 3 శాతం మంది మాత్రమే వృత్తిలో కొనసాగుతున్నారని, చేనేతల ఆత్మహత్యల నివారణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. చేనేతలకు తక్కువ వడ్డీతో రుణాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపాడు. కాగా, సంఘం గౌరవ అధ్యక్షుడిగా బుర్రా మల్లేశం, వేముల బలరాజ్, ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షుడిగా గుండమల్ల రాజు, కోశాధికారి బి.నవీన్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు.

అసెంబ్లీ ముట్టడికి యత్నించిన పీడీఎస్‌యూ నేతలు

● పలువురిని అరెస్ట్ చేసిన పోలీసులు

ఖైరతాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖకు మంత్రిని కేటాయించాలని, బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ నాయకులు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ మాట్లాడుతూ.. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడం లేదన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థుల మరణాలపై విచారణ జరిపి ఆయా సంస్థల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఏర్పడి సంవత్సరం దాటినా విద్యారంగ అభివృద్ధికి, పేద విద్యార్థుల అభ్యున్నతికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు విమర్శించారు. బి.నరసింహారావు, ఎస్.అనిల్, ఎం.నరేందర్, భాస్కర్, పృథ్వీసాయి, సురేష్, వెంకటేష్, రాకేష్, సీతారాం లను పోలీసులు అరెస్ట్ చేశారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

● నిందితుడి అరెస్టు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఒడిశా నుంచి సికింద్రాబాద్ మీదుగా రైలులో గంజాయిని తరలిస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. 13 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావిద్, ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఫ్లాట్‌ఫాం నంబర్ 8కు చేరుకున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు చేయగా జనరల్‌బోగీలో అనుమానాస్పద స్థితిలో కనిపించిన రోహన్‌రాజు(20)ను పట్టుకుని విచారించారు. బెర్తు కింద దాచిన బ్యాగును పరిశీలించగా, అందులో 13 కిలోల పొడి గంజాయిని గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసి సరుకును స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారయ్యారు.



గంజాయి నిందితుడి అరెస్టు చూపుతున్న రైల్వే పోలీసులు

రూ. 60వేలు విలువ చేసే మద్యం స్వాధీనం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నుంచి హైదరాబాద్ నగరానికి అక్రమంగా దిగుమతి అవుతున్న మద్యాన్ని ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు మంగళవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టుకున్నారు. నిందితున్ని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. అతని వద్ద రూ. 60 వేల విలువైన 35 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ ప్రాంతానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి ఢిల్లీ నుంచి ఎన్‌డీపీఎల్ (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్) మద్యాన్ని అక్రమంగా నగరానికి దిగుమతి చేసుకుంటున్నట్లు ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ (స్టేట్ టాస్క్ ఫోర్స్) బృందానికి సమాచారం అందింది. కేఎస్ఆర్ రైల్లో మద్యాన్ని తెస్తున్నట్లు సమాచారం అందడంతో ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలోని బృందం నిఘా పెట్టింది. సికింద్రాబాద్ సమీపంలో నిందితున్ని పట్టుకున్నారు. అతని వద్ద 24 రెడ్‌లేబుల్, 11 డిఫెన్స్ మొత్తం 35 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణతో పోల్చితే ఢిల్లీలో సగం ధరలకే మద్యం బాటిళ్లు దొరుకుతుండటంతో అక్కడి నుంచి ఎక్కువ మొత్తంలో సరుకు తెచ్చి నగరంలో ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అక్రమంగా నగరానికి తెస్తున్న నిందితున్ని పట్టుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

నడుచుకుంటూ వచ్చిన వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బోయిన్‌పల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాకింగ్ చేసుకుంటూ వచ్చిన వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని సుమారు 55 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి సోమవారం రాత్రి ఇంపీరియల్ గార్డెన్ వద్దకు నడుచుకుంటూ వచ్చి అలసిపోయి కూర్చున్నాడు. ఇంతలో అతడిని గమనించిన ఇంపీరియల్ గార్డెన్ వాచ్‌మన్ మంచి నీళ్లు ఇచ్చాడు. కొంతసేపటికి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే వాచ్‌మన్ 108కు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. 108 సిబ్బంది అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.



సంగీత



సిద్ధార్థ

తల్లీకుమారుడి అదృశ్యం

అడ్డగుట్ట డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో కుమారుడిని తీసుకుని ఓ మహిళ బయటకు వెళ్లిపోయింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. తుకారాంగేట్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తుకారాంగేట్‌లో ఉంటున్న సుభాష్, సంగీత భార్యాభర్తలు. వారికి ఇద్దరు సంతానం. సుభాష్ సోదరుడు ప్రకాశ్ పక్కింట్లోనే ఉంటున్నాడు. ఇంటి విషయంలో తరచూ సంగీతతో గొడవ పడుతుండేవారు. ఈనెల 15న కూడా గొడవ జరగగా, విసుగు చెందిన సంగీత తన కుమారుడు సిద్ధార్థ(13)తో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెదికినా కనిపించకపోవడంతో భర్త మంగళవారం తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారం దిశగా తలసాని పర్యటన



సమస్యలను తెలుసుకుంటున్న తలసాని

పద్మారావునగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని సత్వరం పరిష్కరించడమే ధ్యేయమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ గొల్ల కొమురయ్య కాలనీలో వివిధ శాఖల అధికారులతో కలసి పర్యటించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధాన దారిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, కాలనీవాసుల సౌలభ్యం కోసం కమ్యూనిటీ హాల్‌పై మరో అంతస్తు నిర్మించాలని స్థానికులు కోరగా, వెంటనే స్పందించిన ఆయన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వీధిదీపాలు, తాగునీరు, డబుల్ బెడ్‌రూమ్‌ల సమస్యలను పరిష్కరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, డీసీ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, జలమండలి డీజీఎం ఆశిష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు ప్రత్యేక గుర్తింపు : మంత్రి పొంగులేటి



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి బహుమతి అందజేస్తున్న చర్చి జాయింట్ కార్యదర్శి జోస్పె

అడ్డగుట్ట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగకు ప్రత్యేక గుర్తింపు ఉందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌లోని సెంటినరీ బాపిస్ట్ చర్చిలో జరిగిన క్యాండిల్ లైట్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమకారుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, చర్చి జాయింట్ సెక్రటరీ జోస్పె, మాజీ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

రైల్వేప్రగతిలో పెన్షనర్లూ భాగస్వాములే..

● పెన్షన్ అదాలత్‌లో 230 కేసుల పరిష్కారం



పెన్షన్ అదాలత్‌లో పాల్గొన్న జీఎం అరుణ్‌కుమార్ జైన్, ఇతర ఉన్నతాధికారులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే అభివృద్ధిలో పింఛన్‌దారులు కూడా భాగస్వాములేనని జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. జోన్ పరిధిలో పెన్షనర్ల సమస్యలను పరిష్కరించే నిమిత్తం అన్ని డివిజన్లలో పెన్షన్ అదాలత్ నిర్వహించారు. జనరల్ మేనేజర్ మాట్లాడుతూ పెన్షనర్లు ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇస్తామని, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. పింఛనుదారులు భవిష్యత్తులో ఏవైనా ఫిర్యాదులను తమ దృష్టికి తీసుకు వస్తే వాటిని సత్వరమే పరిష్కరిస్తామన్నారు. పెన్షన్ అదాలత్‌కు మొత్తం 271 కేసులు రాగా, వాటిలో 229 కేసులు పరిష్కరించామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్, ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ వివేకానంద్, ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిర్మలా రాజారాం, ఇతర సీనియర్ రైల్వే అధికారులు, గుర్తింపు పొందిన కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యాశాఖ దృష్టికి సమస్యలు

● అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన మదర్స్ అసోసియేషన్ సభ్యులు

అడ్డగుట్ట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి మండల పరిధి అడ్డగుట్ట డివిజన్‌లో ఉన్న అంగన్‌వాడీ సెంటర్లలో 'టీచర్లే ఆయాలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి తెలంగాణ మదర్స్ అసోసియేషన్ స్పందించింది. రాష్ట్ర కన్వీనర్ భాగ్య, సభ్యులు రాంలీల, సువర్ణలతో పాటు బృందం మంగళవారం మూడు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల్లోని సమస్యలను పరిశీలించారు. భవనాలకు అద్దె చెల్లించడం లేదని, పిల్లలకు సమాయానికి భోజనం రావడం లేదని గుర్తించారు. విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.



అంగన్‌వాడీ సెంటర్‌లో ఆహారాన్ని తనిఖీ చేస్తున్న మదర్స్ అసోసియేషన్ సభ్యులు

కార్మిక నాయకుణ్ని కాదు.. సేవకుణ్ని : మర్రి రాఘవయ్య



మర్రి రాఘవయ్యను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

చిలకలగూడ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మిక సంఘ ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ భారీ ర్యాలీ చేపట్టి విజయోత్సవ సభ మంగళవారం నిర్వహించారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో నిర్వహించిన భారీ సభలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రైల్వేమెన్, ద.మ.రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య ప్రసంగిస్తూ... కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానం అమలు చేస్తోందని, భారతీయ రైల్వేలు ప్రైవేటు పరం అయ్యే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో విజయవాడ, సికింద్రాబాద్ డివిజన్లలో మెజారిటీ తగ్గిన గుర్తింపు సాధించామని, ఓటు వేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్మిక నాయకుణ్ణి కాదని సేవకుడనని తెలిపారు. భారతీయ రైల్వేలోని 13జోన్లలో విజయం సాధించామని 17 అంశాలపై జనరల్ మేనేజర్‌తో మంగళవారం చర్చించామని కారుణ్య నియామకాలు, లాలాగూడ వర్క్‌షాపులో బయోమెట్రిక్ అమలు, రన్నింగ్ రూంలలో మెరుగైన సౌకర్యాలు, 6.5కోట్ల ఓవర్ టైమ్ అలవెన్స్ బకాయిలు, మెడికల్ డిక్యాటగిరైజేషన్, ఇంటర్ రైల్వే బదలీలు ఆయన సానూకులంగా స్పందించి తన పరిధిలో సత్వర పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. మహిళలు, యువకులు, అనుభవజ్ఞుల సలహాలు సూచనలు తీసుకొని కార్మిక సంక్షేమం, శ్రేమస్సు కోసం కృషి చేస్తానని తెలిపారు. కనీస వేతన అమలు, 8వ వేతన సంఘం ఏర్పాటు, ఖాళీ ఉద్యోగాల భర్తీ, ఆదాయపు పన్ను పరిమితి పెంపు, తదితర మెరుగైన పెన్షన్ అంశాలపై జాతీయ స్థాయిలో పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యకర్తలు మర్రి రాఘవయ్యని భారీ గజమాలతో సత్కరించారు. హైదరాబాద్ భవన్ నుంచి రైల్ నిలయం వరకు కార్యకర్తలు పార్టీ జండాలు చేతపట్టి, నినాదాలు, పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ర్యాలీగా తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ సంఘ్ సంయుక్త కార్యదర్శి భరణీ భాను ప్రసాద్, సహాయ కార్యదర్శులు రుద్రారెడ్డి, కె.వి.ఆర్. ప్రసాద్, మీడియా ప్రతినిధి షేక్ రఫూఫ్ వివిధ డివిజన్ల కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సిరిపురి కాలనీలో పర్యటిస్తున్న డిప్యూటీ మేయర్

● డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి

తార్నాక, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లాలాపేట్‌లోని సిరిపురి కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి అన్నారు. మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి సిరిపురి కాలనీలో పర్యటించిన డిప్యూటీ మేయర్ స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిరిపురి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ ఆనంద్ బాగ్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తార్నాక జంక్షన్ పునరుద్ధరణ

ఎనిమిది సంవత్సరాలుగా మూసివున్న తార్నాక జంక్షన్‌ను వాహనదారుల సౌకర్యార్థం వచ్చే నెలలో పునరుద్ధరించనున్నట్లు మోతె శ్రీలతశోభన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ట్రాఫిక్ పోలీసులతో కలిసి తార్నాక జంక్షన్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను డిప్యూటీ మేయర్ పరిశీలించారు.

లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలి: గజ్జెల



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న గజ్జెల నగేశ్ తదితరులు



మెట్టుగూడ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి వినతపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ సునీత

బోయినపల్లి, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర బ్రెవరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులపై కేసులు పెట్టి వారి చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా కంటోన్మెంట్ నియోజవర్గ పరిధిలోని బోయినపల్లి మార్కెట్ యార్డు వద్ద ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గజ్జెల నగేశ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణగౌడ్, రావుల సతీష్, గంగారాం, ఆనంద్, శేఖర్, కనకయ్య, పోచయ్య, బోయినపల్లి మార్కెట్ యార్డు రైతులు తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగూడలో...

చిలకలగూడ, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో రైతుల అక్రమ అరెస్టుకు నిరసనగా మెట్టుగూడ చౌరస్తాలో మంగళవారం స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీత ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ముందుగా కార్పొరేటర్ ఇక్కడ ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఏఆర్ కృష్ణ, పోచమ్మ, ప్రకాష్, రవి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడిగా రాపోలు రవీందర్

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడిగా రాపోలు రవీందర్ ఎన్నికయ్యారు. మంగళవారం సాయంత్రం జలసౌధలో ఈ సంఘం కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. వివిధ జిల్లాల నుంచి 400లకు పైగా ఇంజనీర్లు ఇందులో పాల్గొన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా చక్రధర్, గౌరవ అధ్యక్షుడిగా ధర్మ, కోశాధికారిగా ఎస్.అంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా కె.రాజశేఖర్, వి.రామకృష్ణ, ఆర్.సత్యనారాయణగౌడ్, వి.విద్యాసుమన్, శ్రీనివాస్ గౌడ్, విజయలక్ష్మిలు, అసోసియేట్ ప్రెసిడెంట్‌లుగా డి.రమ, ఎం.కృష్ణ, చక్రపాణిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ఏర్పడ్డ తర్వాత తొలిసారి పదవీవిరమణ చేసిన ఇంజనీర్లు ఎవరూ సర్వీసులో లేకపోవడాన్ని స్వాగతిస్తూ ప్రభుత్వానికి సంఘం ధన్యవాదాలు తెలిపింది.